అధ్యాయము 28

# దైవ ప్రత్యక్షత మరియు ఒక మ్రొక్కుబడి

27:46లో రిబ్కా ఇస్సాకుతో మాట్లాడుతూ కనాను దేశములో నివసిస్తున్న "హేతు (హిత్తీయుడు; 23:10చూడండి) కుమార్తెలలో" ఒకదానిని వివాహము చేసుకొనుటకు యాకోబుకు సాధ్యపడే విధంగా ఉన్నదని చెప్పింది. ఏశావు ఈ స్త్రీలలోనే ఇద్దరిని వివాహమాడాడు, మరియు వారు తమ తల్లిదండ్రులకు "మనోవేదన"ను కలుగజేశారు(26:34, 35). తన చిన్న కుమారుడు కూడా అన్యురాలైన భార్యను ఎన్నుకొనిన యెడల తన జీవితము జీవింపనోగ్యము కాదని రిబ్కా ఫిర్యాదు చేసింది.

తన జ్యేష్ఠకుమారుని వివాహముల ద్వారా ఆమె చిరాకు పడినప్పటికీ, తన తండ్రి మరణము తరవాత తన సహోదరుని ఏశావు చంపుతాడనే భయముతో యాకోబును ఇస్సాకు వెంటనే పంపివేయాలని రిబ్కా అనుటకు ముఖ్య కారణమైనది (27:41, 42). మోసము ద్వారా మరియు రిబ్కా యొక్క పూర్తి సహకారంతో తన ఆశీర్వాదమును దొంగిలించినందుకు యాకోబుపై ఏశావు పగ తీర్చుకోవాలని అనుకున్నాడు.

### హారాను వెళ్లుటకు ముందు ఇస్సాకు యాకోబునకు ఇచ్చిన ఆజ్ఞ (28:1–5)

**1ఇస్సాకు యాకోబును పిలిపించి – నీవు కనాను కుమార్తెలలో ఎవతెను వివాహము చేసికొనకూడదు. 2నీవు లేచి పద్దనరాములోనున్న నీ తల్లికి తండ్రియైన బెతూయేలు ఇంటికి వెళ్లి అక్కడ నీ తల్లి సహోదరుడగు లాబాను కుమార్తెలలో ఒకదానిని వివాహము చేసికొనుమని యతనికి ఆజ్ఞాపించి 3– సర్వశక్తిగల దేవుడు నిన్ను ఆశీర్వదించి నీవు అనేకజనములగునట్లు నీకు సంతానాభివృద్ధి కలుగజేసి నిన్ను విస్తరింపజేసి నీవు పరవాసివైయున్న దేశమును, అనగా దేవుడు**

**అబ్రాహామునకిచ్చిన దేశమును నీవు స్వాస్థ్యముగా చేసికొనునట్లు [4]ఆయన నీకు, అనగా నీకును నీతోకూడ నీ సంతానమునకును అబ్రాహామునకు అనుగ్రహించిన ఆశీర్వాదమును దయచేయునుగాక అని అతని దీవించి [5]యాకోబును పంపివేసెను. అతడు పద్దనరాములోనున్న సిరియావాడగు బెతూయేలు కుమారుడును, యాకోబు ఏశావుల తల్లియగు రిబ్కా సహోదరుడునైన లబానునొద్దకు వెళ్లెను.**

**వచనములు 1, 2.** తన వద్దకు రావాలని **ఇస్సాకు యాకోబును పిలిచాడు**; మరియు రిబ్కా ఆశ ప్రకారంగా ఆయనను **ఆశీర్వదించి కనాను కుమార్తెలలో ఎవతెను వివాహము చేసికొనకూడదు** అని ఖండితముగా ఆయనకు **ఆజ్ఞాపించి** పంపాడు. దీనికి బదులు, తన చిన్న కుమారునికి **పద్దనరాములో**[1] **ఉన్న** హారనునకు **వెళ్లమని** (27:43; 28:10) మరియు రిబ్కా **తండ్రియైన బెతూయేలు** ఇంటిలో నుండి ఒక **భార్యను** తీసుకొమ్మని చెప్పాడు. ఇంకా ప్రత్యేకంగా, ఆ యౌవన స్త్రీ **తన తల్లి సహోదరుడైన లాబాను కుమార్తెలలో ఒకటి** అయి ఉండాలి అని చెప్పాడు. ఇస్సాకు యాకోబునకు చేయమని మరియు చేయొద్దని చెప్పిన విషయాలు చాలా సంవత్సరాల క్రితం అబ్రాహాము తన కుమారునికి ఒక భార్యను కనుగొనుటకు తన దాసుని పంపినప్పుడు ఇచ్చిన ఆజ్ఞలకు అనుగుణంగా ఉన్నాయి (24:2–4). ఒకవేళ యాకోబు అన్యురాలైన స్త్రీని వివాహము చేసుకుంటే నిజమైన దేవుని యందు గల విశ్వాసము హింస ద్వారా కాని లేదా దానినే పాటించుట ద్వారా గాని అపాయములో పడుతుందని ఇస్సాకు మరియు రిబ్కాలు భావించారు.

**వచనము 3.** ఇస్సాకు యాకోబును పంపివేయుటకు మునుపు ఆయనను **సర్వశక్తిగల దేవుని** (אֵל שַׁדַּי, *'El Shadday*)[2] పేరిట ఆశీర్వదించిన ఘనత దక్కించుకున్నాడు. దీనికి తోడు, యెహోవా ఆయనను **ఆశీర్వదించి** మరియు **విస్తరింపజేయునని** ("పెరుగునట్లు; NIV) దీవించాడు, ఈ వాగ్దానము సృష్టిలో దేవుడు చేసిన మూల వాగ్దానమును పోలినదిగా ఉంది (1:22, 28; 8:17; 9:1, 7 చూడండి). యాకోబు కుటుంబము బాగా వృద్ధి నొంది **అనేక జనములగునని** ఇస్సాకు చూచాడు.

**వచనము 4.** ఈ పితరుడు తాను పొందిన (17:6–8) **అబ్రాహాము యొక్క ఆశీర్వాదములను** యాకోబునకు యివ్వాలని కోరాడు (26:3, 4, 24). ఇస్సాకు మాట ప్రత్యేకంగా ప్రత్యేకమైనది ఎందుకనగా తన చిన్న కుమారుడే తనకు అధికారికంగా వారసుడు అని మొదటిసారి ఆయన గ్రహించాడు. ఆ పాత్రలో, యాకోబు కుటుంబము **సంచారము చేసిన దేశములను,** అబ్రాహామును మెసొపొతమియా నుండి కనాను దేశమునకు పిలిచినప్పుడు (12:2, 3; 13:15–17; 15:7, 18; 17:6–8, 16, 20; 22:17; 24:7) **దేవుడు అబ్రాహామునకు అందించిన వాటిని పొందుకోవాలని** ఉంది. ఏశావు దైవికమైన ఆశీర్వాదములు పొందుకొనుటకు ముఖ్యమైన వానిగా ఉండాలన్న ఆయన ఆశను దేవుడు

కొట్టివేశాడని ఈ పెద్ద మనిషి తెలుసుకున్నట్లు ఈ ఆశీర్వాదము మనకు సూచిస్తుంది. దీనికి బదులు, అవి యాకోబుకు వెళ్లాలి, ఆయన ఆదిలో అబ్రాహామునకు ఇవ్వబడి తరువాత ఇస్సాకుకు అందజేయబడి ఆ తరువాత తన చిన్న కుమారునికి మరలా చెప్పబడిన ఆశీర్వాదముల మరియు వాగ్దానాల గొలుసులో ఒక వలయముగా ఉంటాడు.

**వచనము 5.** రిబ్కా మొదటిసారి **యాకోబు**కు ఏశావు యొక్క కోపము మరయు ఆయనను చంపాలనే కోరికను గూర్చి చెప్పినప్పుడు ఆయన ఇంటివద్దనే ఉన్నాడు. అయినను, తన భర్తతో ఆమె పలికిన ఒప్పించే మాటల నేపథ్యంలో (27:46) **ఇస్సాకు యాకోబును పంపివేసెను.** ఈ ప్రయాణము ఏశావు ఆగ్రహాము నుండి కాపాడుకొనుటకు దోహదపడినను, దీని ఉద్దేశము యాకోబు **పద్దనరాము**లోని **సిరియావారిలో** నుండి భార్యను కనుగొనడం. ఆమె **బెతూయేలు** మరియు **లాబాను** కుటుంబముల నుండి ఎన్నుకొనబడవలసినది, వీరు రిబ్కాకు తండ్రి మరియు సహోదరులు (24:24, 29). ఇస్సాకు ఆజ్ఞతో, దరిదాపుగా నాలుగు వందల మైళ్ల దూరమున్న దూర ప్రయాణమును యాకోబు చేపట్టాడు (28:10 చూడండి).

## ఇస్సాకును మెప్పించుటకు ఏశావు చేసుకున్న ఆలస్యపు పెండ్లి (28:6–9)

**6ఇస్సాకు యాకోబును దీవించి, పద్దనరాములో పెండ్లిచేసికొనివచ్చుటకై అతని నక్కడికి పంపెననియు, అతని దీవించినప్పుడు – నీవు కనాను దేశపు కుమార్తెలలో ఎవరిని పెండ్లి చేసికొనవద్దని అతనికి ఆజ్ఞాపించెననియు 7యాకోబు తన తలిదండ్రుల మాట విని పద్దనరామునకు వెళ్లిపోయెననియు ఏశావు తెలిసికొనినప్పుడు 8ఇదిగాక కనాను కుమార్తెలు తన తండ్రియైన ఇస్సాకునకు ఇష్టురాండ్రు కారని ఏశావునకు తెలిసినప్పుడు 9ఏశావు ఇష్మాయేలునొద్దకు వెళ్లి, తనకున్న భార్యలుగాక అబ్రాహాము కుమారుడైన ఇష్మాయేలు కుమార్తెయు నెబాయోతు సహోదరియుయైన మహలతును కూడ పెండ్లి చేసికొనెను.**

**వచనములు 6–8.** తన తల్లి యొక్క కోరిక మేరకు **ఇస్సాకు యాకోబును ఆశీర్వదించాడు** మరియు ఆయనను ఆమె **పద్దనరాముకు ఒక భార్యను కనుగొనుటకు పంపివేసిందని ఏశావు** తెలుసుకున్నాడు. తన సహోదరుని **కనాను కుమార్తెలలో నుండి ఒకదానిని భార్యగా** తీసుకొనుటకు తన తండ్రి కూడా అడ్డగించాడని తెలుసుకున్నప్పుడు ఆయన కూడా బహుశా ఆశ్చర్యపడిపోయి ఉంటాడు. దేవుని యందు విశ్వాసిగా లేకుండా (హెబ్రీ. 12:16) ఏశావు ఆత్మీయ వాస్తవాలను గూర్చి తెలియనివాడిగా ఉన్నాడు; అంతేగాక సరియైన వంశావళిలో

నుండి సరియైన వ్యక్తిని వివాహమాడుటలోని ప్రాధాన్యతను కూడా తీవ్రంగా పరిగణించని అమాయకమైన మనిషిగా ఉన్నాడు. సుస్పష్టంగా, హిత్తీయులైన తన భార్యలను బట్టి తన తల్లిదండ్రులు **అయిష్టంగానే** ఉన్నారని కూడా అర్థం చేసుకోలేకపోయాడు (26:34, 35 చూడండి). నమ్మశక్యంగా కాక, హిత్తీయులైన తన భార్యలు అబ్రాహాము మరియు ఇస్సాకు సంతానములో అర్హులుకారని ఆయన ఎన్నడు గ్రహించలేక ఉన్నాడు.

**వచనము 9.** ఇష్మాయేలీయులను కలుసుకొనుట ద్వారా తన తల్లిదండ్రులను సంతోషపరచి మరియు హాగరు ద్వారా అబ్రాహాము యొక్క వారసులలో ఒకరు: **ఇష్మాయేలు కుమార్తెయు** మరియు **నెబాయోతు సహోదరియైన మహలతును** వివాహము చేసుకొనుట ద్వారా **ఏశావు** తన్నుతాను తన తప్పును సరిదిద్దుకొనుటకు ప్రయత్నిస్తున్నట్లు వాక్యము సూచిస్తుంది. ఈ నిర్ణయం అంతగా ఫలించలేదు ఎందుకంటే ఏశావు తన సంతానము వారికి ఎటువంటి విశ్వాస స్వాస్థ్యమును అందించలేదు. **ఇష్మాయేలు** వలె అబ్రాహాము యొక్క భౌతికమైన ఆశీర్వాదములను కొంతవరకు ఆయన పొందుతాడు కాని గొప్పజనముగా అయి భూమి యొక్క సమస్త వంశములకు ఆశీర్వాదములను తెచ్చునట్లు చేసిన దేవుని యొక్క నిబంధనా వాగ్దానములలో మాత్రం పాలిభాగస్తులు కాలేరు (12:2, 3; గలతీ. 3:8, 9, 14–16, 29).

## బేతేలు నందు యాకోబు: దేవుని ప్రత్యక్షత మరియు ఒక మ్రొక్కుబడి (28:10–22)

### యాకోబు యొక్క కల (28:10–17)

**[10–11]యాకోబు బెయేర్షెబానుండి బయలుదేరి హారాను వైపు వెళ్లుచు ఒకచోట చేరి ప్రొద్దు గ్రుంకినందున అక్కడ ఆ రాత్రి నిలిచిపోయి, ఆ చోటి రాళ్లలో ఒకటి తీసికొని తనకు తలగడగా చేసికొని, అక్కడ పండుకొనెను. [12]అప్పుడతడు ఒక కల కనెను. అందులో ఒక నిచ్చెన భూమిమీద నిలుపబడియుండెను; దాని కొన ఆకాశమునంటెను; దానిమీద దేవుని దూతలు ఎక్కుచు దిగుచుండిరి. [13]మరియు యెహోవా దానికి పైగా నిలిచి-నేను నీ తండ్రియైన అబ్రాహాము దేవుడను ఇస్సాకు దేవుడైన యెహోవాను; నీవు పండుకొనియున్న యీ భూమిని నీకును నీ సంతానమునకును ఇచ్చెదను. [14]నీ సంతానము భూమిమీద లెక్కకు ఇసుక రేణువుల వలెనగును; నీవు పడమటి తట్టును తూర్పుతట్టును ఉత్తరపుతట్టును దక్షిణపుతట్టును వ్యాపించెదవు, భూమియొక్క వంశములన్నియు నీ మూలముగాను నీ సంతానము మూలముగాను ఆశీర్వదింపబడును. [15]ఇదిగో నేను**

**నీకు తోడైయుండి, నీవు వెళ్లు ప్రతి స్థలమందు నిన్ను కాపాడుచు ఈ దేశమునకు నిన్ను మరల రప్పించెదను; నేను నీతో చెప్పునది నెరవేర్చువరకు నిన్ను విడువనని చెప్పగా [16]యాకోబు నిద్ర తెలిసి-నిశ్చయముగా యెహోవా ఈ స్థలమందున్నాడు; అది నాకు తెలియకపోయెననుకొని [17]భయపడి –ఈ స్థలము ఎంతో భయంకరము. ఇది దేవుని మందిరమే గాని వేరొకటికాదు; పరలోకపు గవిని ఇదే అనుకొనెను.**

**వచనము 10.** ఏశావు తన జీవితాన్ని బెదిరించినందున మరియు తనకు ఒక సరియైన భార్య కనుగొనేందుకు ఇది సమయము గనుక, కొన్ని సంవత్సరాలుగా కుటుంబ స్థావరముగా ఉన్న **బెయేర్షెబాను యాకోబు** వదలివెళ్లెను (26:23, 33; చూడండి 22:19). అతడు పద్దనరాములో, వాయువ్య మెసొపొతమియలోని,[3] **హారానువైపునకు వెళ్లెను** (28:2, 5). హారాను యాకోబు యొక్క తల్లియైన రిబ్కా యొక్క అసలైన నివాసస్థలం. అయితే, దీనికి ఇంకా ఎక్కువ ప్రాముఖ్యత ఉంది. తన తండ్రి మరణించిన తరువాత, తన ఇంటిని మరియు కుటుంబమును విడిచి వాగ్దాన దేశమునకు వెళ్లమని పిలిచినప్పుడు, అబ్రాహాము అచ్చటనే జీవించుచుండెను (12:4, 5).

ఇస్సాకు యాకోబును హారనుకు పంపడము అనునది ఇస్సాకునకు ఒక భార్యను వెదకుటకు పంపబడిన తన సేవకునికి, అబ్రాహాము యొక్క ఆదేశము: “నా కుమారుని తీసుకొని పోకూడదు సుమీ!” (24:6) అనుదానికి విరుద్ధమైనదిగా ఉంది. ఈ వ్యత్యాస చర్యకు గల కారణము ఏమనగా, యాకోబు విషయంలో, అతని జీవితమును ఏశావు బెదిరించెను. అతడు తన వ్యక్తిగత భద్రత కొరకు వెళ్లవలసి వచ్చింది.

మరొక ముఖ్యమైన తేడా ప్రయాణములలో పంపబడిన సంపదలో ఉంది. అబ్రాహాము, ఇస్సాకు కొరకు భార్యను వెదకుటకు నిర్ణయించుకొనినప్పుడు, రిబ్కా మరియు ఆమె కుటుంబం కోసం బాగారము, వెండితో మరియు కరీదైన బహుమతులతో నిండిన పది ఒంటెలను పంపెను (24:10, 22, 52, 53). అయితే, యాకోబు రిక్త-హస్తాలతో వెళ్లెను. అతని యొద్ద బంగారము గాని, వెండి గాని లేదు, లేదా బహుమతులతో నిండిన ఒక ఒంటె అయినా లేదు. తన కుమార్తె కొరకు లాబానుకు ఓలి ఇచ్చుటకు అతని యొద్ద ఏమియూ కలిగి లేదు. అబ్రాహాము యొక్క గొప్ప సంపద వారసత్వముగా పొందిన ఇస్సాకు ఎందుకు యాకోబును ఒక బిక్షగానివలె పంపెను? ఈ చర్య యాకోబు యొక్క మోసమునకు ఇస్సాకు అనుభవించిన లోతైన బాధను ప్రతిబింబిస్తుంది.

అదనముగా, అతనికి సహాయపడుటకు సేవకున్ని లేదా దూరమైన మరియు ప్రమాదకరమైన యాత్రలో ఒకవేళ ఒంటరి యాత్రికునిపై బందిపోట్లు దాడి నుండి రక్షించుటకు ఎవ్వరూ లేకుండా ఇస్సాకు యాకోబును హారానుకు పంపెను. ఇంటిని వదిలి వెళ్లుటలోని బాధ మరియు జీవితం కొరకు పారిపోతూ, తన ముందున్న

భవిష్యత్తును గూర్చి అతడు ఆందోళనచెంది ఉండవచ్చు. ఈ పరిస్థితులు కూడా తన పితరుల దేవుని మీద లోతైన నమ్మకమును యాకోబుకు కలిగించియుండవచ్చు.

**వచనము 11.** యాకోబు పద్దనరాము వైపు ప్రయాణము చేయుచుండగా, అతనికి ఒక విచిత్రమైన జీవిత మార్పు అనుభవము కలిగెను. **ఒక చోట చేరిప్రొద్దు గ్రుంకినందున,** యాకోబు **అక్కడ ఆ రాత్రి నిలిచిపోయెను.** 28:19లో, ఆ ప్రదేశము "బేతేలు"గా గుర్తించబడినది. ఇది బెయేర్షెబా నుండి బేతేలునకు యాబదియైదు మైళ్లు, గనుక బహుశా ఇది యాకోబు యొక్క ప్రయాణములో మూడవ రోజు. చీకటిలో మరింత ప్రయాణము చేయుట తెలివితక్కువతనము, మరియు అది ఇతర జంతువుల వలన లేదా బందిపోట్లు పొంచి ఉండే అనిశ్చితమైన మైదానము గనుక ప్రమాదకరం కావచ్చు. అందువలన, ఆ చోటి **రాళ్లలో ఒకటి తీసుకొని తనకు** తలగడగా చేసుకొని,[4] **అక్కడ పండుకొనెను.**

**వచనము 12.** ఆ రాత్రివేళ, యాకోబునకు అసాధారణమైన **కల** వచ్చింది. పీడకల వల్ల భయమునకు మరియు అతని సిగ్గుతో కూడిన గతమును అతనికి గుర్తుచేయు పరిష్కరించని అపరాధమునకు బదులుగా, అతడు **భూమిమీద నిలువబడి దాని కొన ఆకాశమునంటుకొనియున్న నిచ్చెనను** గూర్చిన కలకనెను. "నిచ్చెనకు" (סֻלָּם, *sullam*) హెబ్రీ పదము పాత నిబంధనలో ఇక్కడ మాత్రమే ఉపయోగించబడినది. ఆంగ్ల పరిశుద్ధ గ్రంథాలలో (KJV; NRSV; NASB; NEB) "నిచ్చెన" అనునది సంప్రదాయ స్థితిలో ఉన్నప్పటికిని, ఇతర అనువాదములలో (NIV; NJPSV; NLT) "మెట్లు-మార్గము" అని ఉంది. అత్యధికమైన భాషావేత్తలు చెప్పేది ఏమిటంటే *sullam* అనునది "కనపడునట్టు చేయు" లేదా రాళ్లను లేదా సూర్యునిచే కాల్చబడిన మట్టి ఇటుకలను ఉపయోగించి "నిర్మించు"[5] అను అర్థమిచ్చే סָלַל (*salal*) నుండి వచ్చినది. ఇటువంటి నిర్మాణ వస్తువులను పోగుచేయుట ద్వారా, పురాతన మెసొపొతమియలోని ప్రజలు మహా జిగ్గురాట్ (మెట్ల-పిరమిడ్లు) పైన దేవాలయాలకు దారి తీసే గట్టి మెట్ల మార్గమును నిర్మించిరి.[6] మెట్ల మార్గము యొక్క "ఆకాశమునంటిన కొన" కూడా ప్రాముఖ్యమైనది. ఎందుకంటే, ఇది 11:14లో ఉన్న బాబేలు గోపురమునకు ప్రతిబింబముగా ఉంది, అక్కడ అదే విధమైన భాష ఉపయోగింపబడినది. యాకోబు యొక్క కలలో, మానవులెవ్వరూ పైకి మరియు కిందకు ఊరేగింపుగా పోలేదు, దానికి విరుద్ధంగా, **దానిమీద దేవుని దూతలు ఎక్కుచు దిగుచుండిరి.**

**వచనము 13. యెహోవా దానికి పైగా నిలచెను.** హెబ్రీ శైలి נִצָּב עָלָיו (*nitstsab ʻalayw*) "అధ్యక్షత కలిగి, అధికార స్థితిలో నిలబడి యుండుట అని అర్థము."[7] ఈ దర్శనము దేవుడు ఆకాశమునకు మరియు భూమికిని సార్వభౌమునిగా (పాలకుడు) భూమియందు మరియు ఆకాశమందు, ప్రాణులన్నిటినీ ఏలే ఒకనిగా వర్ణించింది. ఆయన మానవ యోచనలకు పాత్రుడు కాడు మరియు వాటిపై ఆధారపడి కూడ లేడు. ఒక మహనీయునిగా, ఆయన అన్ని దేవుళ్లకు లేదా

మనుష్యులు ఊహించుకొన్న దైవాలకు పైవాడు. యెహోవా అన్యదేవతల వంటివాడు కాదని యాకోబు చూచెను, అన్య దేవతలను ఆరాదించువారు తమ సొంత విషయాలను నెరవేర్చుకొనుటకు వారిని మార్చుటకు ప్రయత్నించెదరు. అయితే, దేవుడు తన సొంత ప్రణాళికలు మరియు ప్రయోజనాలు కలిగి, వాటిని నెరవేర్చే సామర్థ్యం గలవాడు.

ఈ ప్రత్యక్షతలతో పాటూ, యాకోబు యెహోవాతో తన సంబంధమును గూర్చి ఒక ప్రాథమిక పాఠం నేర్చుకోవలసి ఉంది: అతడు దేవుని అనుగ్రహమును పొందుటకు ఏమీ చేయలేదని. ఇంతవరకూ తన జీవితంలో, అతడు అసత్యాలు, మోసము మరియు వంచన కంటే కొంచెం ఎక్కువ కనుపరిచాడు. అతని చర్యలు మరియు పైకరులు అతని సోదరునితో సంబంధమును నాశనము చేసాయి మరియు తన తండ్రి గుండె చెదిరేల చేసాయి. కేవలం పరిపూర్ణ దయ ద్వారా **నీ తండ్రియైన అబ్రాహాము దేవుడను ఇస్సాకు దేవుడైన యెహోవాను అని** ఆస్థిరుడై పారిపోతున్న వానిని గుర్తించేందుకు దేవుడే చొరవ తీసుకొనెను.

అద్భుతముగా, తన స్వార్థబుద్ధిని మరియు తన సోదరుడు మరియు తన తండ్రివైపు తాను వ్యక్తం చేసిన అమానుషమైన ప్రవర్తనను బట్టి దేవుడు అతనిని నిందించకుండా యాకోబుతో మాట్లాడెను. తిరస్కారమునకు బదులుగా, దేవుడు మరింత సున్నితమైన మార్గాన్ని ఎంచుకొని, తనను తాను అబ్రాహాము మరియు ఇస్సాకు దేవునిగా పరిచయం చేసుకొనెను. ఈ మాటలు నింద నిరోదనను కలిగి యుండవచ్చు. యెహోవా మొదటి తరం యొక్క (అబ్రాహాము) మరియు రెండవ తరముల (ఇస్సాకు) దేవుడు కావడంతో, ఒక ప్రశ్న ఉహాజనకమైంది: తాను మూడవ తరం (యాకోబు) యొక్క దేవునిగా ఉంటాడా? తనను అనుసరించనందుకు యాకోబును దేవుడు నేరుగా నిందించలేదు; ఆయన ఆ అవకాశమును తెరచి మరియు వదలి బదులుగా అతనితో అబ్రాహాము మరియు ఇస్సాకునకు ఇచ్చిన అదే శుభవార్త అతనితో పంచుకొనెను. దేవుడు కొన్ని సంవత్సరాల క్రితం తన తాతతో చేసిన వాగ్దానం యాకోబుతో పునరావృతం చేసెను, యాకోబు పండుకొనిన **భూమిని** నీకును నీ **సంతానమునకును ఇచ్చెదను** అని పేర్కొనెను.

**వచనము 14.** దేవుడు యాకోబు యొక్క **సంతానము భూమిమీద లెక్కకు ఇసుక రేణువుల వలెనగును; వారు పడమటి తట్టును తూర్పుతట్టును ఉత్తరపుతట్టును దక్షిణపుతట్టును వ్యాపించెదరు** అని తన ప్రతిజ్ఞ కొనసాగించెను. ఇక్కడ వాడబడిన భాష దాదాపు అబ్రాహాముతో దేవుడు చేసిన వాగ్దానము యొక్క అదే ఒక పద ప్రయోగం పునరావృతమైనది (13:14–16), మరియు తర్వాత ఆయన ఇస్సాకునకు సంక్షిప్త రూపములో ఇచ్చినవిధముగా (26:3, 4). యాకోబు మరియు అతని **సంతానము మూలముగాను**, ఆయన తన ఆశీర్వాధములను **భూమి యొక్క వంశములన్నిటికీ** ఇచ్చెదనని, దేవుడు స్పష్టం చేసెను. ఏశావు

మరియు అతని సంతానముపై తన ఆధిపత్యమును పొందుకొని కొనసాగించుటకు తన శారీరక కృషిని సమర్థించుటకుగాను తనకు వచ్చు ప్రతి ఆశీర్వాదముతో, తాను అంత ప్రముఖుడను కానని యాకోబు గ్రహించవలసియున్నది. దేవుడు తన తాతను మరియు తండ్రిని ఆశీర్వదించినది వారు భూమి యొక్క వంశాములన్నిటికీ "ఒక అశీర్వాదకరముగా" ఉండుటకు అని అతడు గుర్తించుకొనవలెను.[8] భూమి యొక్క వంశములన్నీ ఆశీర్వదించబడాలి అను ప్రక్రియ యాకోబు ద్వారా కొనసాగాలి అని దైవిక ఉద్దేశము, కాబట్టి ఎవని నుండి ఈ అన్ని ఆశీర్వాదములు వచ్చెనో, ఆ నిజమైన దేవుని వారు తెలుసుకొందురు.

తన తండ్రి మరియు సహోదరుని పట్ల ప్రేమలేని మరియు మోసగించు ప్రవర్తన అతనికి ఉన్నప్పటికీ ప్రభువు యాకోబుకు ఈ దీవెనలు ఇచ్చాడు. ఇది యాకోబునకు ముఖ్యమైన విపర్యముగా ఉంది. ఇప్పటి వరకూ, కథనము దృష్టిమోసంచేయుట ద్వారా అయినా, దీవెనలు పొందుకొనేందుకు యాకోబు యొక్క ప్రయత్నాల మీదే ఉంది. ఇక్కడ, యాకోబు పొందుకునే ఆశీర్వాదము నుండి అతడు లోకమంతటికీ "ఆశీర్వాదము"గా మారుటకు దేవుడు వక్కాణమును మారుస్తున్నాడు (12:2).

**వచనము 15.** అతనికి అదనపు వాగ్దానాలు ఇవ్వడం ద్వారా తన ఒంటరితనములో మరియు భయము మరియు మెసొపొతమియలో ముందు ఎదురయ్యే అనుకొనని ప్రమాదాలను గూర్చి ఆందోళనచెందుతున్న యాకోబును దేవుడు ప్రోత్సహించెను. **నేను నీకు తోడైయుండి** అని దేవుడు చెప్పెను. ఇది తన తండ్రి, ఇస్సాకు, కొన్నిసార్లు అనుమానాస్పదమైన వారియొద్ద మరియు ప్రతికూల ఫిలిష్తీయుల మధ్యన నివసించినప్పుడు అతనికి దేవుడు ఇదే విధమైన ప్రతిజ్ఞ చేసెను (26:3, 24; చూడండి 31:3; 46:4; 48:21). అలాగే, ఈ పారిపోయేవానికి **తోడైయుండి, వెళ్లు ప్రతి స్థలమందు** నిన్ను **కాపాడుచు,** తన సహోదరుని యొక్క ప్రతీకారం నుండి అతని రక్షించెదనని యెహోవా హామీ ఇచ్చెను (కీర్తనలు 91:11–16 చూడండి). అతడు వదిలి పారిపోతున్న స్థలము, ఈ కనాను **దేశమునకు** [యాకోబును] **మరల రప్పించెదను** అని కూడా దేవుడు చెప్పెను. తన ప్రయాణము హారానులో ఆగదు; అతడు భవిష్యత్తులో ఇంటికి తిరిగి రావచ్చు. తన తల్లిదండ్రులు వాగ్దాన దేశము నుండి పంపివేశారు, కాని యెహోవా అతనిని తిరిగి స్వదేశానికి రప్పించును.

ఈ ఒంటరి ప్రయాణములో ఏ విధమైన అడ్డంకులు యాకోబుకు ఎదురైనా, ఆయన **వాగ్దానము** చేసినవన్నీ నెరవేర్చు **వరకు** నిన్ను **విడువనని** దేవుని యొక్క గంభీరమైన ప్రతిజ్ఞ చేసెను. అయితే "వరకు" అను క్రియ దేవుడు యాకోబును విడిచిపెట్టే సమయం ఒక సమయం రావచ్చు అని సూచిస్తున్నప్పటికీ, ఇది కేవలం ఒక రూపక సాధనం అని ఈ సందర్భంలో తెలుస్తుంది. జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులకు సంబంధం లేకుండా ఇది ఖచ్చితముగా యాకోబుకు యెహోవా

యొక్క సన్నిదిని గూర్చి వ్యంగ్యంగా ఉపయోగింపబడినది. కనాను మరియు మెసొపొతమియల స్థానిక దేవతలవలె వారి సొంత ప్రదేశములు దాటితే శక్తిలేని వారివలె యెహోవా కాదు అని దీని అర్థము. తన పనికి అంతరాయం లేదా ఆటంకము ఏమీ కలుగదని ఒక నిజమైన దేవుడు యాకోబునకు ఒక సంపూర్ణ ప్రతిజ్ఞ చేసెను.

**వచనము 16.** యాకోబు **తన నిద్ర తెలిసి,** ఈ కల యొక్క ప్రాముఖ్యతను గ్రహించెను. ఇది ఏదో సిగ్గు వలనో లేక భయము వలనో తన మనసులో తాను ప్రార్థించినది కాదు. విరుద్ధముగా, ఆ కల అతని మోసము మరియు అబద్ధాలను బట్టి అతని మీద నేరము మోపలేదు గానీ, తన యొక్క ప్రయాణముపైన దేవుని కృప, సానిధ్యము, కాపుదల మరియు విజయమును గూర్చిన శుభవార్త. **నిశ్చయముగా యెహోవా ఈ స్థలమందున్నాడు; అది నాకు తెలియకపోయెను** అని చెప్తూ ఆయన ప్రతిస్పందించెను. దేవుని యొక్క ఈ నాటక సంబంధమైన దర్శనము పూర్తిగా ఆకస్మికమైనది. నిజముగా దేవుడు అతని జీవితములో ఉన్నాడన్న భావనను ఇంతకు ముందు ఎప్పుడునూ యాకోబు గ్రహించలేదా? ఒక పరిశుద్ధ స్థలము లేదా దేవాలయం లేకుండా ఆ అపవిత్ర ప్రదేశములో ఇటువంటి సంఘటన జరుగునని అతడు ఖచ్చితముగా ఊహించలేదు.[9]

**వచనము 17.** యాకోబు ఏ భయమూ లేకుండా నిద్రపోయాడు కాని, మేల్కొనినపుడు **అతడు భయపడెను.** దేవుడైన యెహోవా యొక్క సన్నిధి అతనిని భయమునకు గురిచేసెను. అతడు **ఈ స్థలము ఎంతో భయంకరము** అని బిగ్గరగా అనెను. తాను ఒక పవిత్రమైన స్థలమందు పండుకొనెనని, ఆ స్థలమందు ఉన్న ప్రత్యేకమైన దేవుని సన్నిధిని చూచి తెలుసుకొనెను. అంతవరకు ఎటువంటి ప్రాముఖ్యత లేని ఈ స్థలమునకు, యాకోబు చాల ప్రాధాన్యతను ఇచ్చెను. అది అతడు చెప్పిన రెండు వాక్కుల ద్వారా మనకు తెలియును.

మొదటిగా, యాకోబు ఆ స్థలమును **దేవుని మందిరముగా** పిలిచెను. ఈ పదజాలము దైవిక ప్రదేశములకు (పరిశుద్ధ స్థలములకు) సహజమైనదే, ప్రాచీన ప్రజలు నివసించే దేవుళ్లను నమ్మేవారు. అయినప్పటికీ, యాకోబు దేవుని మందిరమును ఒక భౌతికమైన గుడిగా అనగా, ప్రజలు వెళ్లి ఆరాధించి వచ్చే ఒక స్థలముగా పరిమితం చేయలేకపోయెను. అది దేవుడు తన ప్రజలతో ఉండే ఆత్మీయ సన్నిదిగా చూచెను.

రెండవదిగా, యాకోబు ఆ స్థలము తనను దేవుని యొద్దకు నడిపించినందున, ఇది **పరలోకపు గవిని** అని పలికెను. ఇక్కడ ఉపయోగించబడిన భాష బాబెలు గోపురము యొక్క కథను గుర్తు చేస్తున్నది (11:4,9); "బాబెలు" అను మాటకు "దేవుని యొక్క ద్వారము" లేక "దేవుళ్ల యొక్క ద్వారము" అని అర్థము. యాకోబు తన కలలో చూసినట్లు ఇక్కడ ఎటువంటి నిచ్చెన బాబెలులో కనబడదు.

యాకోబు వాడిన "దేవుని మందిరము," మరియు "పరలోకపు గవిని" అనే

రెండు మాటలు విగ్రహారాధనకు దగ్గిర పోలికలు ఉన్ననూ, అవి ఒక క్రొత్త ఆత్మీయ ప్రాముఖ్యతలోనికి వచ్చుచుండెను. మనుష్యులు వెళ్లి బహుమానములతోను, అర్పణలతోను తమ దేవుళ్లకు ప్రార్ధించే మానవ నిర్మిత గుళ్లు, గోపురాలుగా ఈ స్థలమును అతడు ఆలోచించుటలేదు. అంతేకాక, ఒక వ్యక్తి దేవునిచే దీవించబడుటకు తన యోగ్యతను దేవుని ఎదుట నిరూపించుకోనక్కరలేదని యాకోబు తెలుసుకొనెను. దేవుడే ఒక పాపిగా ఉన్న యాకోబునకు ఒక స్వప్నము ద్వారా తనను తాను బయలుపరచుకొనుటకు ముందుకు వచ్చెను. అతని తండ్రియైన ఇస్సాకును, తాతయైన అబ్రాహామును ఎలాగైతే పిలిచి ఆశీర్వాదించెనో, యాకోబును కూడా అట్లే దీవించెను.

## యాకోబు యొక్క మ్రొక్కుబడి (28:18–22)

**[18]తెల్లవారినప్పుడు యాకోబు లేచి తాను తలగడగా చేసికొనిన రాయితీసి దానిని స్తంభముగా నిలిపి దాని కొనమీద నూనె పోసెను. [19]మరియు అతడు ఆ స్థలమునకు బేతేలను పేరు పెట్టెను. అయితే మొదట ఆ ఊరి పేరు లూజు. [20–21]అప్పుడు యాకోబు –నేను తిరిగి నా తండ్రి యింటికి క్షేమముగా వచ్చునట్లు దేవుడు నాకు తోడైయుండి, నేను వెళ్లుచున్న యీ మార్గములో నన్ను కాపాడి, తినుటకు ఆహారమును ధరించుకొనుటకు వస్త్రమును నాకు దయచేసినయెడల యెహోవా నాకు దేవుడైయుండును. [22]మరియు స్తంభముగా నేను నిలిపిన యీ రాయి దేవుని మందిరమగును; మరియు నివు నా కిచ్చు యావత్తులో పదియవవంతు నిశ్చయముగా నీకు చెల్లించెదనని మ్రొక్కుకొనెను.**

**వచనములు 18, 19. యాకోబు** ఆ భయంకరమైన, ఉత్సాహమైన స్వప్నమును చూసిన తరువాత ఆ రాత్రి, చాలా తక్కువగా నిద్రపోయెను. అతడు **వేకువనే లేచి**; తాను తలగడగా **చేసుకొనిన రాయి తీసి**, దానిని **స్తంభాముగా నిలువబెట్టెను** (מַצֵּבָה, *matstsebah*). అతడు **దాని కోన మీద నూనె పోసి**, ఆ స్థలమును ఒక మతపరమైన గుర్తింపునిచ్చి ప్రతిష్టించెను. ఇది రాయిని నిలబెట్టుటను గూర్చిన బైబిలులో మొదటి వివరణ ఐనప్పటికీ, దానిపై యాకోబు నూనె పోయుట ఒక క్రొత్త పద్ధతిని సూచిస్తున్నది. అతడు ఆ **స్థలమునకు లూజు** అనే **పేరుకు మార్చి బేతేలు** ("దేవుని మందిరము") అని పేరు పెట్టెను. అంత వరకు బహు తక్కువ పలుకుబడి ఉన్న ఈ కనాను పట్టణము తరువాతి శతాబ్దాలలో ఇశ్రాయేలీయుల ఆరాధనా కేంద్రముగా మారెను.

రాళ్లను నిలబెట్టుట అనేది ప్రారంభ బైబిల్ సంఘటనలలో కొన్ని ఉన్ననూ, పితరులు మరియు మోషే కాలములలో ఈ నిలబెట్టబడిన స్తంభము చాలా ప్రాముఖ్యతను కలిగియుండెను. రాతి స్తంభములు అనేక విధులను కలిగియుండెను. (1) అవి తన ప్రజలతో ఉన్న దేవుని సన్నిధికి గుర్తుగా ఉన్నవి

(28:18, 22; 31:13; 35:14). (2) దేవుని నిబంధన ద్వారా సీనాయి పర్వతము వద్ద ఇశ్రాయేలీయుల పన్నెండు గోత్రముల ఐక్యతకు గుర్తుగా పన్నెండు స్తంభములను నిలబెట్టెను (నిర్గమ 24:4). (3) కొన్ని సార్లు స్తంభములను సరిహద్దులను స్థిరపరచటకును, ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఒప్పందమునకు గుర్తుగా ఉపయోగించిరి (31:45, 51, 52). (4) తమ ప్రియుల సమాధులను గుర్తించుటకు స్తంభములను వాడిరి (35:20), కొన్నిసార్లు జీవించుచున్న వారికి గుర్తుగా స్తంభములు నిలువబెట్టిరి (2 సమూ. 18:18).

ఇశ్రాయేలీయులు వాగ్దాన దేశములోనికి ప్రవేశించుటకు సిద్ధపడుచుండగా, మోషే వారికి కనానీయ స్తంభములను గూర్చిన హెచ్చెరికలు ఇచ్చెను. పైకి అవి ఏ కీడు తలపెట్టని జ్ఞాపికలుగా కనిపించును గాని, నిజానికి అవి విగ్రహారాధనకు, అనైతిక జీవితానికి చెందియుండును. అందునుబట్టి, దేవుని ప్రజలెవ్వరూ, ప్రత్యేకమైన స్తంభములు నిలువబెట్టరాదనియు (ద్వితీ. 16:22), వాటిని నాశనం చేయాలనియు (నిర్గమ. 23:24; 34:13; ద్వితి. 7:5; 12:3) చెప్పబడెను. ఎందుకు దేవుడు వీటి విషయములో ఇంత కఠినముగా చెప్పెననగా, తన ప్రజలు చాల సులువుగా ఆ స్తంభములను విగ్రహములుగా పూజింప మొదలుపెట్టుదురు అని దేవునికి తెలియును. ఊహించని రీతిగా కనాను ప్రజల అన్య పద్ధతులు ఇశ్రాయేలీయులు కూడా పాటించుట మొదలుపెట్టి, విగ్రహారాధన వైపునకు త్రిప్పి వేయబడిరి. ఈ ప్రవర్తన మూలముగా వారి దేశము పతనమై, శత్రువ చేతికి అప్పగింపబడెను (1 రాజులు 11:4–8; 14:21–28; 2 రాజులు 17:6–18; 23:4–8, 13–15, 24–27; 24:1–4).

**వచనములు 20–22. యాకోబు** స్వప్నము ద్వారా తనతో మాట్లాడిన దేవునితో అట్లు **జరిగితే ... అప్పుడు** అనే ప్రతిపాదన గల ఒక **మ్రొక్కుబడి** చేసుకొనెను. యాకోబు అనేకమైన షరతులు దేవుని ముందు ఉంచి, అవి నెరవేర్చబడితే అప్పుడు దేవుని సేవించదను అని దేవునితో బేరమడెను.[10] మొదటిగా అతడు **దేవుడు తనకు తోడుగా ఉండి** తన **ప్రయణమంతటిలో కాపాడవలెను** అని కోరెను. రెండవదిగా, అతడు దేవుని **తినుటకు ఆహారమును, ధరించుటకు వస్త్రములను** ఇమ్మని అడిగెను. చివరిగా, దేవుడైన యెహోవాను మరలా తిరిగి తన **తండ్రి ఇంటికి** క్షేమముగా తీసుకొని రమ్మని కోరెను. అతడు **యెహోవాయే** తనకు **దేవుడని** వాగ్దానము చేసెను. అంతేకాక, అతడు **స్తంభాముగా నిలబెట్టిన రాతిని, దేవుని మందిరమునకు** గుర్తుగా ప్రతిష్టించెను. చివరిగా, దేవుని యెద్ద నుండి పొందుకున్న వాటి అన్నిటి నుండి **పదియవ వంతు** దేవునుకి **ఇచ్చెదనని** చెప్పెను (14:20 చూడుము). ఈ చివరి ఒప్పుకోలు దేవుడైన యెహోవాతో అతని తీర్మానము యొక్క తీవ్రతను మనకు చూపిస్తున్నది.[11]

యాకోబు బేతేలు అనుభవం ద్వారా ఒక ప్రారంభమైన అతని ప్రయాణం, ఇంకా దేవుని మనిషిగా దేవుని పనిలో ఎలా ఉండాలో ఎంతో నేర్చుకొనవలెనని

తెలియజేసెను. యాకోబు తన ప్రవర్తనలో మార్పునకు ఇంకా అనేక సంవత్సరాల కాలము, ఎన్నో శ్రమలు ఎదుర్కొని, దేవునిపై ఇంకా పూర్తిగా ఆధారపడుచూ, నీతిఫలమును ఫలింపవలెను. చివరిగా, హారానులో తనకు భార్యను కనుగనుటకు ప్రారంభమైన అతని ప్రయాణం, దేవుని ప్రణాళికలో తన స్థానమును తెలుసుకొని, "భూమిపై ఉన్న కుటుంబాలు అన్నిటికీ" దీవెనకరముగా ఉండుటకు కారణమాయెను (28:14).

## అన్వయము

### పాపియైన ఒక మానవుడు దేవునిని ఎదుర్కొనుట (అధ్యాయము 28)

యాకోబు బేతేలునందు దేవునిని కలుసుకొనక ముందు, ఆది. 28:12–15లో వ్రాయబడినట్టుగా, తన తండ్రియైన ఇస్సాకు యొక్క మరణ శయ్య నొద్ద నుండి దీవెన పొందుకొనుటకు అతనితో అబద్ధమాడెను. ఏశావు తన సహోదరుని చంపి తన పగ తీర్చుకొనగోరెనని రచయిత తెలిపెను. కాని, తన తండ్రి యొక్క మరణము వరకు అతడు వేచియుండెను (27:41). రిబ్కా తన పెద్ద కుమారుని యొక్క ప్రణాళికను తెలుసుకొనెను; తన భర్తతో శతృత్వం తెచ్చుననుకొని, ఆ సంగతి తన భర్తకు తెలియజేయలేదు. అంతేకాక, ఏశావు తన తండ్రికి ప్రియమైన కుమారుడు. ఏశావు చేసినట్లుగా, యాకోబు కూడా తనకు భార్యను కనాను స్త్రీని వివాహముచేసుకొనుట తాను సహించలేనని యాకోబుతో అనెను (27:46). అనేక సంవత్సరములకు ముందు అబ్రాహాము యొక్క సేవకుడు తనను ఇస్సాకునకు భార్యగా ఎలాగు కనుగొనెనో, అదేరీతిగా హారానులో ఉన్న తన సహోదరుడైన లాబాను ఇంటికి తనకు భార్యను కనుగొనుటకు యాకోబును కూడా పంపవలెనని రిబ్కా యాకోబును కోరెను (28:1–5).

*పాపియైన ఒక మానవుడు తన ఇంటినుండి పారిపోవుట.* యాకోబు తన సుదూర ప్రయాణము అనగా ఇంచుమించు నాలుగు వందల మైళ్లు, తన యాత్రను గూర్చిన అనేక సందేహాలతోను, ఎదురయ్యే పరిస్థితులను గూర్చిన భయముతోను ప్రారంభించెను. తనకు అన్నీ తెలుసు అనుకొనిన ఇతడు ఇప్పుడు ఏమీ తెలియని స్థితికి వచ్చెను. ఐశ్వర్యము, అధికారము మరియు నాయకత్వం కొరకు ప్రాకులాడిన ఇతడు అన్నీ, చివరికి ఇంటిని కూడా విడిచిపెట్టవలసి వచ్చెను. ఐశ్వర్యము మరియు అధికారము కొరకైన అతని దురాశ—ఏశావు యెద్ద నుండి ఒక ప్రమాణము అతని తండ్రి యొక్క ఆశీర్వాదము నుండి, తన కుటుంబము యొక్క నాయకత్వములో రెట్టింపు స్వాస్థ్యమును ఇచ్చెను. ఇవేమీ హారానులో ఒక భార్యను సంపాదించుకొనుటకు అతనికి ఉపయోగపడలేదు. అతని మొదటి ప్రయాణములో అతడు జయము పొందినను, బెయేర్షెబాకు తిరిగి వచ్చి ఒక క్రొత్త జీవితము

ప్రారంభించుటకు అనుకూల పరిస్థితులు కనబడలేదు.

యాకోబు తన ఇంటిని విడచినపుడు, అతడు స్వార్థము, అత్యాశ మరియు అవినీతిపరులకు మాదిరిగా ఉండెను. అట్టి ప్రజలు ఎవరి మీద పడునో, అనగా: కుటుంబము, స్నేహితులు, లేక పనిచేసే స్థలంలో ఉన్నవారు అని చూడకుండా సులువుగా నిచ్చెన ఎక్కి విజయం పొందాలనుకుంటారు. "మీ పాపము మిమ్మును పట్టుకొనును" (సంఖ్యా. 32:23) అనే పాఠాన్ని ఘోరమైన పరిస్థితులు ఎదుర్కొనుట ద్వారా నేర్చుకొందురు. యాకోబు ఈ సమయములో తన మోసపూరిత ఆలోచనల యొక్క పరిణామం ఎరుగక ఉండెను. తనకు కాబోయే మామయైన లాబాను, భవిష్యత్తులో బెయర్షేబాకు తిరిగి రాక ముందు తనను హారానులో ఎటువంటి శ్రమలు పెట్టునో అతనికి తెలియదు.

*దేవుడు వెంబడించుట.* బెయర్షెబా నుండి లూజు (బేతేలు)నకు మూడు దినములు ప్రయాణము తరువాత సుర్యాస్తమయమున చేరెను (28:10, 11). చీకటిలో అతడు ఒక రాయిని కనుగొని దాని తలగడగా చేసుకొని నేలమీద నిద్రపోవ ప్రయత్నించెను. అది కేవలము భౌతికమైన చీకటి, చీకటి ద్వారా కలిగిన ఒంటరితనము ద్వారా యాకోబుకు కలిగిన బాధయే కాక, అతడు అంతరంగమందు ఒక చీకటి అనుభూతిని ఎదుర్కొనెను.

ఆ నేలపై పండుకోనగా అతడు అనేక ప్రశ్నలతో, సందేహాలతో, మరియు భయాందోళనలతో ఉండెను. అతడు ఏశావు యొక్క పగను తప్పించుకొని, తనకు ఒక భార్యను వెతుక్కోనుచుండెను తప్ప దేవుని గూర్చిన ఆలోచన అతడికి లేదు. అతనికి తెలియకుండానే, తన తల్లిదండ్రుల ద్వారా వినిన దేవుని యొక్క కార్యమును అతడు తోసిపుచ్చుచుండెను. కాని, దేవుడు అబ్రాహాముతోను (12:1; అపొ. 7:2), మరియు ఇస్సాకుతోను (26:2–4, 24, 25) మాట్లాడిన రీతిగా యాకోబుతోకుడా మాట్లాడాలనుకొనేను. దేవుడే యాకోబుతో దర్శన రీతిగా మాట్లాడెను. అతని యొక్క సిగ్గుకరమైన జీవితానికి గాని, అతడు చేసిన తప్పుకు గద్దింపుగాని ఆ దర్శనము తెలియచేయలేదు. దానికి ప్రతిగా దేవుడు యాకోబునకు తనను తాను బయలుపరచుకొని, అతనికి ఒక క్రొత్త భవిష్యత్తును గూర్చి, నిరీక్షణను, అతని జీవితానికి క్రొత్త మార్గమును చూపెను.

దేవుడు యాకోబుతో దర్శనములో (28:12), తాను "ప్రభువు" (యెహోవా)గా, అబ్రాహాము, ఇస్సాకుల దేవునిగా బయలుపరచుకొనెను (28:13). ఆయన యాకోబును, అతని సంతానమును ఈ రీతిగా ఆశీర్వాదించెదనని వాగ్దానము చేసెను. (1) అతడు పండుకొనియున్న ఆ భూమిని స్వాస్థ్యముగా ఇచ్చెదను. (2) అతని సంతానము భూమ్యందంతటా విస్తరించును, వారి ద్వారా భూమిపై ఉన్న కుటుంబాలన్నీ ఆశీర్వదింపబడును (28:14). (3) దేవుడు యాకోబుతో మరింత వ్యక్తిగతంగా ఉంటానని చెప్పెను (28:15; 26:3, 24; 31:3; 46:4; 48:21; నిర్గమ. 3:12 చూడుము). దేవుడు యాకోబును "కాపాడుచు," అతని ప్రయాణమంతటిలో

అతనిని భద్రపరచి, రక్షింతునని చెప్పెను (28:15; కీర్తనలు 91:11–16). దేవుని ప్రణాళికలో అతడు మరలా తిరిగి అతడు ఏ ఇంటిని విడిచి పారిపోవుచున్నాడో, మరలా తిరిగి ఆ కనాను దేశమునకు వచ్చుట కూడా కలదు (28:15).

దేవుడైన యెహోవా, యాకోబును అతని ప్రయాణము ఎంత ఎంత కాలము పట్టినా, ఎన్ని ఇబ్బందులు ఎదురైననూ విడిచిపెట్టలేదు (28:15). యాకోబు లాబాను వద్ద హారానులో ఇరవై సంవత్సరాలు దోపిడీకి గురైనను, దేవుడు అతనితోటే ఉండెననే మాట ద్వారా బలము పొందిరి. వారు, "సైన్యములకు అధిపతియైన యెహోవా మనకు తోడైయున్నాడు, యాకోబు యొక్క దేవుడు మనకు ఆశ్రయమైయున్నాడు" అనిరి (కీర్తనలు 47:7, 11).

*పాపి యొక్క ప్రత్యుత్తరము.* ఆ దర్శనము చూచిన యాకోబు లేచి ఎంతో భయపడి, "నిశ్చయముగా దేవుడు ఈ స్థలమందు ఉన్నాడు, అది నాకు తెలియకపోయెను ... ఇది యెహోవా మందిరము, పరలోకపు గవిని ఇదే అనెను (28:16, 17). జ్ఞానియైన ఒకరు తరువాత కాలములో "యెహోవా యందలి భయము జ్ఞానమునకు మూలము" (సామెతలు 1:7) అని వ్రాసెను; ఆ దర్శనము ద్వారా కలిగిన దైవ ప్రతక్షతను బట్టి, భయముతో నిండుకొనిన ఆ దేవుని గూర్చి మరింత జ్ఞామును కలిగియుండుట యొక్క అవసరతను తెలుసుకొనెను. అతడు తన అన్నను మోసము చేయుట, తన తండ్రితో అబద్ధమాడుట అనే మోసపూరితమైన ప్రవర్తన గుర్తెరిగినను, ఆ సమయములో అదే సరియైన కార్యమని తనను తాను సమర్థించుకొనెను. కాని ఈ దర్శనమును చూసిన తరువాత, ఒక భయముతో ఆ పరిశుద్ధుడైన దేవుని ముందు తాను ఒక పాపినని గుర్తించెను. అలాంటి పాపిననే ఒప్పుకోలు, తగ్గింపు ఎల్లపుడు అవసరమైనవి.[12] దేవుడైన యెహోవా తనతో లూజునందు ఉన్నాడని యెరిగి, దేవుని ప్రజలు ఎక్కడైతే ఉంటారో ఆ స్థలమందు "దేవుని మందిరము" (బెతేలు) అనే ఒక విషయమును యాకోబు గుర్తించాడు. తద్వారా తన పితరుల యొక్క దేవుని యొక్క స్వభావమును, మహిమను అతడు తెలుసుకొనుట ప్రారంభించెను.

కాలము సంపుర్ణమైనపుడు, దేవుడు తన అత్యున్నత మహిమను శరీరములో ఉన్న యేసునందు వివరించెను. దేవుడు తాను కేవలము ఒక మనిషిగా మాత్రమె కనబనట్టుగా తన మహిమను మరుగుపరచెను; అయినప్పటికీ, యేసుక్రీస్తు సాధారణమైన మానవుని కన్నా మించినవాడు. ఆయన దేవుని అద్వితీయ కుమారుడు (యోహాను 1:49). తన పరిచర్యలో, అనేక అద్భుత కార్యములు జరిగించి తన గుర్తింపును తెలిపెను (అపో. 2:22; 10:38). ఒక సంఘటనలో, యేసు గలిలయలోని కానాలో నీటిని ద్రాక్షారసముగా మార్చినపుడు, "తన మహిమను కనపరిచెను" అని వ్రాయాడెను (యోహాను 2:11).

యేసు క్రీస్తు "దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిమంతముసైయుండి" (హెబ్రీ. 1:3), ఈ లోకములోనికి నశించినదానిని వెదకి

రక్షించుటకు ఆశించే ప్రేమ గల తండ్రి హృదయమును బయలుపరచుటకు వచ్చెను (లూకా 15:1–32; 19:1–10). సువార్త యొక్క పిలుపు ఆర్థిక, సామాజిక, మతపరమైన బేధాలు లేకుండా, అందరికి ఇవ్వబడెను: కాని, యేసుక్రీస్తు తన పరిచర్యలో ఎక్కువగా సామాన్య ప్రజల వద్దనే గడిపెను (లూకా 7:36–50; యోహాను 9:1–41). యేసుక్రీస్తు దయ్యములను వెళ్లగొట్టుట ద్వారా, రోగులను స్వస్థపరచుట ద్వారా మరియు పాపులను దీవించు వంటి పరిచర్యల ద్వారా దేవుని మహిమను కనుపరచెను (మార్కు 1:21–2:17).

ఇదంతయు యూదుల పెద్దలకును, ప్రధాన యాజకులకును, శాస్త్రులకును,మరియు పరిసయ్యులకును ఆయాసకరముగా ఉండెను, కాని ఇవన్నీ సిలువ మరణం ద్వారా (యోహాను 12:31–33; 2 కొరింథీ. 5:19–21) యేసుక్రీస్తు చూపిన దేవుని యొక్క "ప్రేమకు" (యోహాను. 3:16), "మహిమకు" (యోహాను 12:23, 28; 2 కొరింథీ. 3:18) సాదృశ్యమై ఉన్నది. ఈ ప్రక్రియలో, యేసుక్రీస్తు తన ప్రాణమును ఈ లోక పాపములకు "క్రయధనము"గా (మార్కు 10:45; ఫిలిప్పి 2:5–8) ఇచ్చెను. సహృదయము గలవారు ఆయనను విశ్వసించి, విధేయతతో ఆరాధింతురు. ఆయన యొక్క ప్రేమను, దయను రుచి చూచి మార్పు చెందినా వారు ఈ రీతిగా స్పందింతురు (మత్తయి28:9, 17; యోహాను 9:38; అపొ. 2:22–42).

లూజు నందు దేవుని మహిమ ప్రత్యక్ష్యతకు యాకోబు చూపిన స్పందన తమ పితరును పోలినదిగాను (12:7, 8; 22:1–18; 26:1–5, 24, 25; అపొ. 7:2 చూడుము), యేసుక్రీస్తును వెంబడించువారిని పోలినదిగాను ఉన్నది. దేవుడు యాకోబును ఆశీర్వదించుటకు, అతనికి అతని వారసులకు కాపుదల ఇచ్చుటకు గల తన శుభవార్త బయలుపరచినపుడు, ఈ కఠినుడైన వ్యక్తిలో విశ్వాసమును, సమర్పణను మరియు ఆరాధనను పుట్టించెను. యాకోబు యోగ్యతలేని, స్వార్థపరుడైన తాను దేవుని ప్రణాళిక ద్వారా, ఈ భూమిపై ఉన్న కుటుంబాలన్నిటికీ ఆశీర్వాదము తెచ్చే వానిగా దేవుడు తనను ఎన్నుకొనెనని గుర్తించెను (28:13–15).

మొట్టమొదటి సారిగా యాకోబు క్రొత్తగా ఆలోచించుట మొదలుపెట్టెను. ఈ ఆరాధనకు కృతజ్ఞతగా తాను తలగడగా ఉపయోగించిన రాతిని జ్ఞాపకార్థ స్తంభముగా నిలువబెట్టెను. దానిపై నునె పోసి, ప్రతిష్టించి, "బేతేలు" (దేవుని మందిరము) అని పేరు పెట్టెను. అంతేకాక, దేవుడైన యెహోవా తాను సెలవిచ్చిన రీతిగా ఆశీర్వదించినయెడల, తాను ఆయనను ఆరాధించి, సేవింతును అని నిశ్చయించుకొనెను. బేతేలు అనబడే ఆ స్థలమును ఒక ఆరాధనా స్థలముగా చేసి, తనకు సమస్తమును ఇచ్చిన దేవునికి పదియవ వంతు చెల్లించెదనని చెప్పెను (28:18–22). యాకోబు తన "ఆలాగు జరిగితే ... అప్పుడు" అనే వాగ్దానం చేసినప్పుడు, అతడు దేవునితో బేరమాడునట్లు కనబడును. ఈ విధానము

ఆరాధాన యొక్క ప్రారంభం మాత్రమే కాని, అత్యున్నతమైన విధానము కాదు. దేవునికి విధేయత చూపాలనుకునే ప్రతీ ఒక్కరు క్రొత్త జీవిత విధానాలు, ప్రాధాన్యతలు కలిగి ఉండాలి.

## పరలోకానికి మన నిచ్చెన మార్గం యేసుక్రీస్తే (28:12)

యేసుక్రీస్తే యాకోబు యొక్క నిచ్చెన మార్గాన్ని గూర్చిన వాగ్దానమునకు అంతిమ నేరవేర్పై ఉన్నాడు. యోహాను తన సువార్తలో, యేసుక్రీస్తు నతానియేలును కలవకముందే అతడు ఎటువంటి స్వభావము కలవాడో యేసుకు ముందే తెలుసునని యోహాను వ్రాసెను. ఆ యవ్వనస్తుడు ఆశ్చర్యపడి, యేసుక్రీస్తును దేవుని కుమారునిగాను, ఇశ్రాయేలునకు రాజుగాను ఒప్పుకొనెను. అందుకు బదులుగా యేసు, "మీరు ఆకాశము తెరువబడుటయు, దేవుని దూతలు మనుష్య కుమారుని పైగా ఎక్కుటయును దిగుటయును చూచెదరు" (యోహాను 1:51) అనెను. యేసుక్రీస్తు పరలోకానికిని, భూమికిని సరియైన బంధమును కలిపేవాడు.

తన శిష్యులతో మేడ గదిలో పస్కాను ఆచరించిన తరువాత, ప్రభువు వారితో తాను తండ్రి ఇంటికి (పరలోకమునకు) వెళ్లి, వారి కొరకు "స్థలము సిద్ధపరచుటకు" వెళ్తున్నానని అనెను (యోహాను 14:2). ఆయన వారితో "నేను వెళ్లుచున్న స్థలమునకు మార్గము మీకు తెలియును" అనగా; అందుకు తోమా ప్రభువా, "ఎక్కడికి వెళ్లుచున్నావో మాకు తెలియదే; ఆ మార్గామేలాగు తెలియును?" (యోహాను14:4, 5) అని అడుగగా అప్పుడే యేసు "నేనే మార్గము, సత్యము, జీవమును. నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు" (యోహాను14:6). యేసుక్రీస్తు మాత్రమే దేవుని యొద్దకు "మార్గము" (నిచ్చెన మార్గము).

## "దేవుని మందిరము" (28:16, 17)

యాకోబు లూజు వద్ద ఆకాశమునకు వేయబడిన నిచ్చెన యొక్క దర్శనమును చూచినపుడు, అతడు, "నిశ్చయముగా యెహోవా ఈ స్థలమందు ఉన్నాడు, ఇది నాకు తెలియకపోయెనే." అతడు భయపడి, "ఈ స్థలము ఎంతో భయంకరము ఇది దేవుని మందిరమే గాని వేరొకటి కాదు, పరలోకపు గవిని ఇదే" అనెను (28:16, 17). అతడు తన జీవితములో దేవుని సన్నిధిని గూర్చి తెలుసుకొనుట ప్రారంభామాయెను. అతని చివరి దినాలలో యాకోబు, తన జీవితాంతము దేవుడు అతనికి తోడుగా ఉన్నాడని పలికెను (48:15). దేవుని ప్రజలు ఇక్కడ ఉంటారో, వారితో దేవుడు ఉంటాడు.

ఇశ్రాయేలీయులు ఎర్ర సముద్రమును దాటి సీనాయి పర్వతము చేరువరకు, దేవుడు "మేఘ స్తంభముగాను" మరియు "రాత్రి యందు అగ్ని స్తంభముగాను"

నడిపించెను అనే సత్యమును గ్రహించలేదు (నిర్గమ. 13:21, 22; 14:19, 24). నలభై సంవత్సరాలు అరణ్యములో తిరుగులాటలో, మందసముపై ఇదే అగ్ని స్తంభము మరియు మేఘ స్తంభము నిలిచి వాగ్దాన దేశమునకు నడిపెను (నిర్గమ. 29:42–46; 40:34–38).

ఆ తరువాత కాలములో, సొలొమోను మందిర నిర్మాణము ద్వారా, “దేవుని మహిమ” కనబడెను; ఎట్లనగా “యెహోవా తేజోమహిమ యెహోవా మందిరములో నిండుకొనగా ఆ మేఘమున్న హేతువు చేత యాజకులు సేవచేయుటకు నిలువలేకపోయిరి” (1 రాజులు 8:10, 11). క్రమముగా ఇశ్రాయేలీయులు ఆ కట్టడమునకును, అక్కడ అర్పించే అర్పణలకును మూడనమ్మకమును కనుపరచుట ప్రారంభించిరి. వారు విశ్వాసము దేవునిపై కాక మందిరముపైనే చూపిరి. వారు తాము చేసిన విగ్రహారాధన, వ్యభిచారము మరియు చంటి పిల్లలను బలి ఇచ్చుట వంటి పాపములను దేవుడు లక్ష్యపెట్టడని తలంచిరి. దేవుని సన్నిధిలో ఆరాధన జరిగినంత కాలం యెరూషలేము లేక తన మందిరము నాశనము అవ్వడానికి దేవుడు అనుమతించలేదు అని వారు ఊహించారు (యిర్మీయా 7:1–15).

అటువంటి ఆలోచన ద్వారా, యెరూషలేము ప్రజలు ప్రవక్తల మాటలు వినక, హృదయాలు కఠినపరచుకొని తమ పాపములు ఒప్పుకొనుటకు ఇష్టపడక పోయిరి. యూదా రాజ్యమునకు దాని ముఖ్య పట్టణమైన యెరూషలేమునకును సమయము ఆసన్నమైనపుడు, ఆ పట్టణములో ఉన్న ప్రజలు, దేవుడు తన మందిరము ఉన్న ఆ పట్టణమునకు కాని, మందిరమునకు కాని ఏ హానీ కలుగనీయడు అనే తప్పుడు ఆలోచనలో ఉండిరి. తమకంటే ముందుగా బాబులోనుకు చెరగొనిపోబడిన యూదా సహోదరులను హేళన చేస్తూ మిగిలినవారు, “వారు యెహోవాకు దూరస్తులైరి” అని అనుచూ, యెరూషలేము పట్టణము దేవుడు తమకు “స్వాస్థ్యముగా” ఇచ్చినది కనుక వారు సురక్షితముగానే ఉన్నామని అనుకొనుచుండిరి (యెహేజ్కేలు 11:15).

బబులోనులో, తమ గృహాలకు దూరముగా అన్య దేశములో ఉన్న యూదులకు, దేవుడు తానే వారికి “పరిశుద్ధాలయము” (מִקְדָּשׁ, *miqdash*, “పరిశుద్ధ స్థలము” లేక “దేవాలయము”; యెహేజ్కేలు 11:16[13]) అని తెలియజేసెను. పాత నిబంధనలో అరణ్యములో ప్రత్యక్ష గుడారమునకును (నిర్గమ. 25:8, 9; లేవీ. 12:4; 19:30; 20:3), యెరూషలేములో ఉన్న మందిరమునకును (1 దిన. 22:19; 28:10; 2 దిన. 20:8; నెహెమ్యా 10:39) *miqdash* అను పదమును వాడిరి. బబులోను దేశములో ఉన్న ఇశ్రాయేలీయులకును, వాయువ్య మెసొపొతమియ మార్గములో మొదటి ఇశ్రాయేలీయుడైన యాకోబునకును దేవుడు ఒక వార్తమానమిచ్చెను. అదేమనగా: నీవు ఎక్కడ ఉన్నప్పటికీ, నిజమైన “దేవుని ఇల్లు” (మందిరము) తాను వాగ్దానము చేసిన రీతిగా తన ప్రజలతోనే ఉండును

(26:3, 4; 28:15).

యేసుక్రీస్తు నందు దేవుడు తనను తాను బయలుపరచుకొనే వరకూ, యాకోబు యొక్క కల, యెహేజ్కేలు చూసిన దర్శనము సంపూర్ణ నేరవేర్పులోనికి రాలేదు. యోహాను "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యమే దేవుడైయుండెను" (యోహాను 1:1) అని వ్రాసెను. తరువాత, యేసుక్రీస్తు శరీరధారియగుటను గూర్చి, యోహాను, "ఆ వాక్యమే శరీరధారియై, కృపాసత్యసంపుర్ణుడుగా మనమధ్య ('ప్రత్యక్షగుడారముగా'[14]) నివసించెను; తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమ వలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" (యోహాను 1:14).

సీనాయి పర్వతము వద్ద ఉరుములు, మెరుపులు ద్వారా దేవుని మహిమను చూసిన ఇశ్రాయేలీయుల అనుభూతికి, చాల వ్యత్యస్తముగా దేవుడు తన మహిమను కనుపరచెను (నిర్గమ 19:16–18). ఈ మహిమ ప్రత్యక్షత, మోషే చావకుండా బ్రతుకునట్లు దేవుడు తన మహిమను మరగుపరచిన విధముగాను(నిర్గమ 33:20–23), ఇశ్రాయేలీయులు చూడలేనంత వెలుగుతో నింపబడి, వారితో మాట్లాడుటకు ఒక ముసుగు ధరించవలసిన మోషే ముఖప్రకాశాముగాను (నిర్గమ 34:29–34) కాక వేరుగా ఉండెను.

ఈ భూమిపై తన పరిచర్యలో దేవుడు శిష్యులతో యేసుక్రీస్తు వలే ఒక ప్రత్యేకమైన విధముగా జీవించెను. ఆయన తిరిగి లేచి, తన శిష్యులను ఈ భయంకరమైన లోకములోనికి సువార్త ప్రకటించుటకు పంపుచున్నపుడు (మార్కు 16:15, 16), "నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నాను"అనెను (మత్తయి 28:20). అనేక సంవత్సరాల తరువాత హెబ్రీ క్రైస్తవులు హింసను ఎదుర్కొనుచుండగా, హెబ్రీ పత్రిక రచయిత మరొక వాగ్దానమును, "నిన్ను ఎన్నడును విడువను ఎదబాయను" (హెబ్రీ. 13:5) జ్ఞాపకము చేసెను. అంతేకాక "యేసుక్రీస్తు నిన్న, నేడు, నిరంతరము ఒకే రీతిగా ఉన్నాడు" అని వారిని ప్రోత్సాహించెను (హెబ్రీ. 13:8).

## మార్పు మరియు ఒప్పందము (28:18–22)

యేసుక్రీస్తు యొక్క శిష్యులు ఆయనను వెంబడించుట మొదలుపెట్టినపుడు వారి జీవితాలు ఎలా మారునో, శిష్యత్వపు వెల ఎంతో వారికి ఎంటువంటి ఆలోచనా లేదు. యాకోబు వలె వారు, "ఆలాగు జరిగితే .... అప్పుడు" అనే ఒప్పందము చేసుకొనకపోయినను, వారు కూడా యేసు ప్రభువు రాజ్యములో అధికారమును, సంపదను కోరుకొనిరి (మత్తయి 19:23–30; 20:20–28). అందువలన, ప్రభువు యొక్క పరిచార్యలోని బోధలకు, తద్వారా ఎదురయ్యే పరిస్థితులకు పలుమార్లు వారు కలవరపడిరి. ఆయన పవిత్ర జీవితము, ధర్మశాస్త్ర వివరణ శాస్త్రుల, పరిసయ్యుల వేషధారణను బయలుపరచుచున్నవని వారు యెరిగియుండిరి

(మత్తయి 5:1–7:29; 23:1–39; మార్కు 2:1–12). శాస్త్రులు, పరిసయ్యులు యేసుక్రీస్తును వారు కలిగి ఉన్న గౌరవ స్థానములకు ఇబ్బంది కలిగించు వానిగాను, రోమా యొక్క కోపం తమ దేశంపై పడునేమో అనే భయము కలిగి ఉన్నారని శిష్యులు తెలుసుకొనిరి (యోహాను 7:14–32; 8:48–59; 11:7–10; 45–53).

యేసుక్రీస్తు యూదుల అధికారుల చేతిలో ఎదురయ్యే తన మరణమును గూర్చి ముందుగా శిష్యులతో చెప్పినపుడు, మెస్సీయకు ఇట్టిది ఎట్లు సంభవించునని ఆశ్చర్యపోయిరి. పేతురు, "ప్రభువా, అది నీకు దూరమగును గాక, అది నీకెన్నడు కలుగదు" (మత్తయి 16:22) అని గద్దించెను. యేసుక్రీస్తు బంధించబడినప్పుడు, వారందరూ ఆయనను విడచి చీకటిలోనికి పారిపోయిరి (మార్కు14:50). యూదుల వలన భయముతో తలుపులు గడియలు బిగించుకొని లోపలనే ఉండిరి (యోహాను 20:19). కేవలము యేసుక్రీస్తు యొక్క పునరుత్థానమే ఈ పిరికివారిని శక్తిగలవారిగా మార్చి, హింసకు గురైనను, మరణము వచ్చినను ధైర్యముగా యేసే దేవుని కుమారుడనియు, లోక రక్షకుడనియు ప్రకటించే వారిగా చేసినది (అపొ. 4:1–12; 5:27–32; 7:51–8:3; 12:1–5). సజీవమైన విశ్వాసముతో వారు దేవుని ఆరాధించుచూ, వారి చివరి శ్వాశ వరకు ఆయనను ప్రభువుగా స్తుతించిరి (అపొ. 7:59, 60).

---

సూచనలు

[1]"పద్దనరాము" అను పేరు సహజంగా వాయువ్య మెసొపొతమియలోని 24:10లో ఉన్న "అరామ్నహరాయిము"కు మారుపేరుగా అర్థం చేసుకుంటారు. అయినను ఇది హారను పట్టణమునకు మారుపేరని మరికొందరు ఆలోచిస్తారు. (Wayne T. Pitard, "Paddan-aram," in *The Anchor Bible Dictionary*, ed. David Noel Freedman [New York: Doubleday, 1992], 5:55.) [2]దేవుని యొక్క ఈ పేరు ఆయన సర్వ సామర్ధ్య శక్తిని వక్కణించునట్లు అనిపిస్తుంది (చూడండి 17:1; నిర్గమ. 6:3). [3]పురాతన హారను యొక్క స్థలము ఆధునిక టర్కీ మరియు సిరియా సరిహద్దులో, దక్షిణమునకు ప్రవహించి యూఫ్రటీసు నదిలో కలిసిపోవు బలిహ్ నది తీరమునకు సమీపమున ఉన్నది. [4]పురాతన కాలంలో, తలగడి చాలా గట్టిదిగా ఉండియుండవచ్చు. వీటిలో రాతితో, లోహముతో, మరియు చెక్కతో చేయబడిన కొన్ని ఐగుప్తులో కనుగొనబడినవి. ఉదాహరణకు, దీనిలోని చిత్రమును చూడండి Alfred J. Hoerth, *Archaeology and the Old Testament* (Grand Rapids, Mich.: Baker Books, 1998), 112. [5]R. K. Harrison, "Ladder," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 3:60. [6]జిగ్గురట్ అనునది పరలోకమునమును భూమిని కలుపు ప్రాంతమని పురాతన ప్రజలు నమ్మేవారు. క్రొత్త సంవత్సరం రోజున, మరియు కొన్ని ప్రత్యేక సందర్భాలలో కావచ్చు, వారి దేవతలను ఆరాధించుటకు వారి జిగ్గురట్ పై ఉన్న దేవాలయములలోనికి మెట్ల ద్వారా రాజులు మరియు యాజకుల గుంపు వెళ్తుండేవారు. వారి ఆరాధన విధులు సమాప్తమైన తరువాత మరియు తమ బహుమతుల ద్వారా తమ దేవతలను సంతోషపరిచామను నమ్మిక కలిగిన తరువాత,

ఎన్నో ఆశీర్వాదములతో క్రొత్త సంవత్సరమును ఆనందించాలనే ఆశతో, వారు ఆ మెట్ల మీదిగా తమ పట్టణ రాజ్యములకు దిగి వచ్చేవారు. [7]Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 18—50*, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1995), 241. [8]వారు ఈ ఉద్దేశమును నెరవేర్చిన అనేక మార్గములను ఆదికాండము అనుబంధపరుస్తుంది (12:2, 3; 14:13–24; 17:4–8; 22:17, 18; 25:11; 26:2–4, 12–14, 24, 28, 29). [9]చాలా సంవత్సరాల క్రితం అబ్రాహాము అదే ప్రాంతములో (బేతేలుకు తూర్పున) యెహోవాకు ఒక బలిపీఠము కట్టి ఆయనకు ప్రార్థన చేశాడు (12:8). అయితే, యాకోబు బేతేలులోని వేరే ప్రాంతమున రాత్రి గడిపియుండవచ్చు (అతడు ఉత్తరమునకు ప్రయాణం చేస్తున్నాడు కాబట్టి). ఆ ప్రాంతములో తన తాత యొక్క ఆరాధనను గూర్చి అతనికి తెలిసియుండకపోవచ్చు, మరియు అక్కడ బలిపీఠము అప్పటికి లేకుండా పోయి ఉండవచ్చు. [10]ఈ షరతులలో చాలా వరకు 28:15లో దేవుని ద్వారా ముందుగానే వాగ్దానము చేయబడినవి. క్లుప్తంగా, యాకోబు దేవునికి ఏమి చెబుతున్నాడంటే, "నీవు నాతో చేసిన వాగ్దానములు నెరవేర్చినట్లయితే, నేను నీకు ఇది చేస్తాను."

[11]దేవుడు యాకోబును కనానుకు తిరిగి తీసుకొనివచ్చినప్పుడు, బేతేలులో బలిపీఠము కట్టమని దేవుడు అతనిని హెచ్చరించెను (35:1). పదియవ వంతు ఇస్తాను అని యాకోబు చేసిన మ్రొక్కుబడిని అక్కడ తన మందలో నుండి పశువులలో నుండి జంతువులను బలి అర్పించుట ద్వారా యాకోబు నెరవేర్చియుండవచ్చు (35:7). [12]మోషే (నిర్గమ. 3:6), ఇశ్రాయేలు (నిర్గమ. 19:16), గిద్యోను (న్యాయాధి. 6:22, 23), సంసోను తల్లిదండ్రులు (న్యాయాధి. 13:20–22), యెషయా (యెషయా. 6:5), మరియు పేతురు (లూకా 5:8, 9) ఉదాహరణలో ఇది రుజువైనది. [13]Thomas E. McComiskey, "שָׁכַן,"in *TWOT*, 2:789. [14]"నివసించు" అని అనువదించబడిన గ్రీకు పదము σκηνή (*skēnē*, "ప్రత్యక్ష గుడారము") అను నామవాచకం యొక్క క్రియా రూపములో ఉంది.